క్లుప్తంగా

ఉపాధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు: ఉపాధి హామీలో చేసిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలన ఆడిట్ అధికారులు చేపట్టినందున ఉపాధి కూలీలు సహాయకులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజ్‌మనోజు తెలిపారు. సోమవారం ఉంగుటూరులో ఉపాధి సహాయకులకు, ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ సంవత్సర కాలం నుంచి నిర్వహించిన పనుల దస్త్రాలను సిద్ధం చేయాలని సూచించారు. సామాజిక తనిఖీలో కొలతలు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటరమణ, టెక్నికల్ సహాయకులు, సహాయకులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ సమస్యల పరిష్కారానికి కృషి


క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవన్ కుమార్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: పోతునూరు, కేదవరం, ఉండ్రాజవరం గ్రామాల్లో చర్చిల అభివృద్ధికి సమస్యలు పరిష్కారానికి సహకారం అందించాలని పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప కోరారు. సోమవారం క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యాలయం వద్ద పోతునూరు గ్రామ సర్పంచ్ స్వరూప్, గ్రామ నాయకులతో కలిసి ఇటీవల నియమితులైన వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జీవన్ కుమార్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జీవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆధ్యాత్మిక అభివృద్ధికి క్రిస్టియన్ మైనారిటీ సెల్ బలోపేతానికి అందరి సహాయ సహకారాలతో కృషి చేస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: పెదవేగి మండలం, పెదవేగి సెక్షన్ రామసింగవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రామసింగవరం, ఆసన్నగూడెంలలో మరమ్మతుల నిమిత్తం జులై 1వ తేదీ మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

టెండర్లు పూర్తికాగానే నిర్మాణ పనులు

భీమడోలు: భీమడోలు వంతెన నుంచి పెదలింగంపాడు వరకుగల రోడ్డు నిర్మాణానికి నాబార్డ్ నిధులు రూ.70 లక్షలు మంజూరయ్యాయని భీమడోలు పీఆర్ డీఈ వి.వేణుగోపాల్ సోమవారం అన్నారు. రెండు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉన్నందున ఆ రోడ్డు శాశ్వత నిర్మాణానికి ఏప్రిల్‌లో నిధులు మంజూరు కాగా టెండర్ల ప్రక్రియ చురుగ్గా సాగుతుందన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

ద్వారకాతిరుమల: మండలంలోని మహదేవపురం గ్రామంలోని రామాలయంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాస వేడుకలు ఘనంగా నిర్వహించారు. దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు రుద్రమూర్తి వేద మంత్రోచ్చరణల నడుమ చిన్నారులతో అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ధర్మ ప్రచారక్ ఉండ్రాజవరపు వెంకటరత్నం, పాతకోకల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలకు విద్యారంభం శుభప్రదంగా ఉండాలని, అలాగే భారతీయ సంస్కృతి పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు.

తపాలా బీమా ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీల సేకరణ నిమిత్తం ఏజెంట్ల నియామకానికి జూలై 07, 08 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏలూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ సురకత్తుల శ్రీకర్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని, ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ సర్టిఫికేట్లు, బయోడేటాతో ఏలూరు పోస్టల్ డివిజన్ కార్యాలయం, అంబికా గుడి వద్ద, సత్రంపాడు, ఏలూరు-7 అడ్రస్‌కు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 88853 35548లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అధ్వాన రహదారులతో ప్రమాదాలు


తల్లాపురం-నారాయణపురం పుంత రహదారి దుస్థితి


వర్షానికి జారిపోతున్న నారాయణపురం-ఉంగుటూరు రహదారి

- వర్షాలతో ధ్వంసమైన రహదారులు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఉంగుటూరు: వర్షంతో రహదారులు ఛిద్రం అయ్యాయి. ఏ రహదారి చూసినా రహదారులు గోతులు పడి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు నారాయణపురం బ్రిడ్జి పడిపోవడంతో ఉంగుటూరు, నారాయణపురం రహదారుల పరిస్థితి మరీ అధ్వానంగా మారాయి. నారాయణపురం రాజుల కాలనీ వద్ద నుంచి ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వరకు ఉన్న రహదారి బురదగా మారింది. నారాయణపురం నుంచి చేబ్రోలు-తల్లాపురం రహదారికి కలిసే పుంత రహదారి పెద్ద పెద్ద బళ్ల గాడుల వలే పడిపోయాయి. దీనికి కారణం తేలికపాటి వాహనాలు కాకుండా 20 టన్నుల నుంచి 50 టన్నుల వరకు ఉన్న చేపల లోళ్లు, గ్రావెల్ లారీలు తిరగటం వలననే ఈ పరిస్థితి ఏర్పడింది. అలాగే టోలు గేటు ఎగవేతదారులు ఉంగుటూరు-నాచుగుంట బ్రిడ్జి వరకు కాలువ గట్టు మీద వాహనాలు నడపడంతో ఆ రహదారి పాడతోంది. కంకర లారీలు బరువైనవి ఈ రహదారుల్లో తిరగటం, రహదారులు ఛిద్రంగా మారిపోయాయి. వాహన దారులు ఇబ్బందులు పడతున్నారు. అలాగే నారాయణపురం-చేబ్రోలు పోలీస్టేషన్ రహదారి పాడైపోయింది. ఇదికాక దొంతవరం-కాకర్లమూడి, రావులపద్రు-దొంతవరం, ఉప్పరగూడెం రహదారి, యర్రమళ్ల-వెల్లమిల్లి రహదారి, కాగుపాడు-దేవర కొండేపాడు రహదారి, ఉప్పరగూడెం-సీతారామపురం రహదారి, కొత్తగూడెం-ఉంగుటూరు రహదారి, గోకవరం కంసాలిగుంట రహదారి పాడైపోయాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వర్షాకాలం దీంతో రహదారుల పరిస్థితి దయనీయంగా ఉండటంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇవిగాక మండలంలో మరికొన్ని రహదారుల పరిస్థితి బాగోలేదు.

ఆన్‌లైన్‌లో పొరపాట్లను సరి చేయండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు వీరమాచినేని శివాజీ

దెందులూరు: పొలం సబ్ డివిజన్ చేసినప్పుడు ఆన్‌లైన్‌లో ఒకరికి బదులు మరొకరి భూమి నమోదయిందని వాటిని సరి చేయాలని రైతు వీరమాచినేని శివాజీ కోరారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో తహసీల్దార్ బి.సుమతికి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. వాటికి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో భీమరాజు, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు, ఏపీఎం సురేష్ పాల్గొన్నారు.

నేడు పొలం పిలుస్తోంది

దెందులూరు: మండలంలోని దెందులూరు, చల్లచింతలపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామని దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు. రైతులు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సాగుకు సంబంధించి సమాచారాన్ని సూచనలు సలహాలను పొందాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మలేరియాపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి పి.అరుణజ్యోతి, ఎంపీహెచ్‌ఈవో వైవీ లక్ష్మణరావు

భీమడోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి.అరుణజ్యోతి అన్నారు. పూళ్ల పీహెచ్‌సీలో సోమవారం మలేరియా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీహెచ్‌ఈవో వి.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పి.అరుణజ్యోతి మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి నెలాఖరు వరకు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మలేరియా కార్యక్రమంపై అవగాహన సదస్సులను నిర్వహించి వారిలో చైతన్యం కల్పించామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ప్రతి రోజూ ఫీవర్ సర్వే కొనసాగుతుందని, సాధారణ జ్వరం వచ్చినా ఆరోగ్య సిబ్బంది దృష్టికి తీసుకొచ్చి ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ వ్యాధి వచ్చిన తర్వాత కన్నా ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేయించుకోవాలన్నారు. పొడి వాతావరణం ఉండేలా చూసుకోవాలని, కీటక జనిత ప్రదేశాలను నిలువరించడంతో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోద, మెదడు వాపు వ్యాధులు రావన్నారు. అనతరం గ్రామంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ఆనంద్, ఏఎన్‌ఎంలు, సూర్యచంద్రరావు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కుల వివక్ష చూపితే కఠిన శిక్షలు


కొత్తపల్లిలో పౌరహక్కుల సదస్సులో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: సమాజంలో ఉన్న అన్ని కులాలు, వర్గాలు, మతాల ప్రజలు సమానమేనని, కొన్నికులాలు ఇతరకులాల పట్ల వివక్ష చూపడం తగదని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. సోమవారం గణపవరం మండలం కొత్తపల్లి గ్రామంలో తహసీల్దార్ అప్పారావు అధ్యక్షతన సివిల్ రైట్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంగరాజు మాట్లాడుతూ కుల వివక్ష చూపే వారిని కఠినంగా శిక్షించేలా అనేక చట్టాలు రాజ్యాంగంలో పొందుపరిచారని వివరించారు. సమాజంలో జాతి, కుల వర్గ విభేదాలు లేకుండా అందరూ స్నేహభావంతో జీవించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ పేటలో మంచి నీటి సమస్య ఉందని కొందరు సదస్సులో తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ మద్దాల రత్నకుమారి, మధు, రెవెన్యూ, పోలీస్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సత్కారాలు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఆయనకు సత్కార సభ నిర్వహించారు. ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.గిరిబాబు, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. గణపవరం, నిడదవోలు డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లు నిర్మలకుమారి, జ్యోతి, గోపన్నపాలెం వ్యాయామ కాలేజీ ప్రిన్సిపాల్ సతానియేలు, సర్పంచ్ దిడ్ల అలకనంద తదితరులు పాల్గొన్నారు.

మారిశెట్టి ఆదర్శనీయుడు

మారిశెట్టి సత్యనారాయణ నేటి తరం ఉపాధ్యాయులకు ఆదర్శ ప్రాయుడని డీవైఈవో రవీంద్ర భారతి అన్నారు. సోమవారం చేబ్రోలు సింహాద్రినగర్ ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయుడు పదవీ విరమణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీసునీత, ఉపాధ్యాయ సంఘ నాయకులు శీతాల సత్యనారాయణ, ఉనుముల రాంబాబు, జోగినాయుడు, శ్రీధర్ కమలకుమార్ బొమ్మిడి అప్పారావు, మాజీ సర్పంచి కరనం బుజ్జి, తదితరులు పాల్గొని శాలువాలు కప్పి ఘనంగా సత్యనారాయణను త్కరించారు.

గుండుగొలనులో..

భీమడోలు: గుండుగొలను నంబర్-1 ఆదర్శ పాఠశాలలోని సెకండరీ గ్రేడ్ టీచర్ దొండపాటి వైకేవీఎస్ ఆనంద్‌బాబు పదవీ విరమణ కార్యక్రమం సోమవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, హెచ్‌ఎం పి.పాండురంగారావు తదితరులు ఆయన సేవలను కొనియాడారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలి

ఉద్యోగులు బాధ్యతయుతంగా పని చేస్తే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సబార్డినేట్ (అటెండర్) కేశిరెడ్డి పుల్లారావు పదవీ విరమణ అభినందన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీపీ, కార్యాలయ ఏవో శర్మ, సిబ్బంది పుల్లారావు దంపతులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ నాయకులు వగ్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: అంకితభావంతో పని చేస్తే ఏ రంగంలోనైనా గుర్తింపు వస్తుందని దెందులూరు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ హెచ్‌ఎం వల్లపట్ల విజయకుమార్ అన్నారు. దెందులూరు కమ్యూనిటీ హాల్‌లో గొల్లగూడెం హెచ్‌ఎం వల్లపట్ల విజయలక్ష్మి ఉద్యోగ విరమణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు, కట్నేని అమృత, సరోజిని, వెన్నమనేని రత్నాకర్, దెందులూరు మండల యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపరంలో..

గణపవరం: కొండేపాడు వీఆర్వో కె.జానకిరాముడు ఉద్యోగ విరమణ చేయడంతో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సత్కారం నిర్వహించారు. తహసీల్దార్ వీఏ అప్పారావు, వీఆర్వోల సంఘ మండల అధ్యక్షుడు కేశవమూర్తి తదితరులు ఆయన సేవలను కొనియాడారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి


వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం నిర్వహిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి: దెందులూరు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించి నూతన మండల అధ్యక్షులు, మండల, గ్రామ కమిటీల నియామకంపై మండలాల వారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ కమిటీలకు ఎన్నికైన నాయకులను అభినందించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు ఎంవీఎస్‌వీ ప్రసాద్ (జానంపేట బాబు), అప్పన ప్రసాద్, తేరా ఆనంద్, కామిరెడ్డి నాని పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

పెదపాడు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా వరుసగా నాల్గోసారి అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరికి, అప్పన ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ నేతలు, కార్యకర్తలు పూల మాలలు, దుశ్శాలువాతో సత్కరించారు.

ఆత్మీయ కలయిక

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని సోమవారం ఏలూరులోని ఆయన కార్యాలయంలో దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసు రాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మేక సత్యనారాయణ, పార్టీ దెందులూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దాల నాగయ్య, ఏలూరు రూరల్ మండలం అధ్యక్షులు తేరా ఆనంద్, సొసైటీ మాజీ చైర్మన్ చల్లగోళ్ల భూస్వామి, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

లేబర్ కోడ్ల రద్దు కోరుతూ 9న సమ్మె


సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. సీఐటీయూ స్థానిక జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా సమావేశంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లింగరాజు, ప్రసాద్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా పట్టణ, మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో వందలాది మంది ఉద్యోగ కార్మికులతో ప్రదర్శన, సభలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను కార్పొరేట్లకు, ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా మోదీ ప్రభుత్వం అప్పగిస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమ్మె ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ, సమ్మె విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి


సమావేశంలో పాల్గొన్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఫ్రీ లీగల్ ఎయిడ్ ద్వారా అందించే కేసుల త్వరితగతిన పరిష్కారానికి ప్యానల్ న్యాయవాదులు కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఆయన సోమవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్యానల్ న్యాయవాదులతో వర్క్ రివ్యూ నిర్వహించారు. కక్షిదారులకు ఉచితంగా వాదించే కేసులు పై ఆరా తీశారు. జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, కేసుల పరిష్కారాన్ని కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్‌వీ మునేశ్వర ప్యానెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రకు సర్వం సిద్ధం

- నేడు ఏలూరులో మూడోసారి యాత్ర
- భారీగా పాల్గొననున్న భక్తులు


జగన్నాథ, బలదేవ్, సుభద్ర విగ్రహాలు


గత ఏడాది నగరంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో మూడో సారి జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. జూలై ఒకటో తేదీన నిర్వహించే రథయాత్రకు ఇస్కాన్ ప్రతినిధులు భారీగా ఏర్పాట్లు చేశారు. శనివారపు పేటలోని ఇస్కాన్ మందిరం వద్ద నుంచి యాత్ర ప్రారంభం కానుంది. రథానిన సుందరంగా ముస్తాబు చేశారు. మందిరం వద్దకు ఆదివారం చేరుకున్న రథాన్ని, రథంలో నగర యాత్ర చేయనున్న జగన్నాథుడు, జగన్నాథుని సోదరుడు బలదేవ్, సోదరి సుభద్ర ఉత్సవ విగ్రహాలను నగరానికి చెందిన పలువురు భక్తులు సందర్శిస్తున్నారు.

రథయాత్ర సాగేదిలా..

జగన్నాథ రథయాత్ర నగరంలోని అన్ని ముఖ్య ప్రాంతాలనూ కలుపుతూ ముందుకు సాగనుంది. లునాని పార్కు వద్ద ఉన్న ఇస్కాన్ మందిరం నుంచి మధ్యాహ్నం 1.30 గంటల నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర అశోక్ నగర్‌లోని ఆయుష్ ఆసుపత్రి, డీమార్ట్ రోడ్డు, వెంకట్రామా థియేటర్ రోడ్డు, రామచంద్రరవు పేట ప్రధాన రహదారి మీదుగా ఫైర్ స్టేషన్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడి నుంచి ఓవర్‌బ్రిడ్జి మీదుగా ఒన్‌టౌన్‌లోకి ప్రవేశిస్తుంది. వన్‌టౌన్‌లోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ రాత్రికి స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణానికి చేరుకుంటుంది. యాత్రను ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభిస్తారని, ఇప్పటికే వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 400 మంది ఇస్కాన్ ప్రతినిధులు నగరానికి చేరుకున్నారని, వీరితో పాటు నగరానికి చెందిన జగన్నాథుని భక్తులు యాత్రలో నడువనున్నట్టు ఏలూరు ఇస్కాన్ మందిర అధ్యక్షులు రాధావల్లభ దాస్ తెలిపారు. యాత్ర భక్తులు నృత్యాలు, కీర్తనలు, గానాలు, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య నిర్వహిస్తామన్నారు.

రామకోటిలో ప్రత్యేక కార్యక్రమాలు

రథయాత్ర రామకోటి ప్రాంగణానికి చేరుకున్న అనంతరం అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో స్వామి వారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు శుకదేవ మహరాజ, ఖమ్మం ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు నిత్య యుక్త దాస్, తిరుపతి ఇస్కాన్ టెంపుల్ సెక్రటరీ లీలాపరాయణ దాస్‌లు జగన్నాథ, బలబద్ర, సుభద్ర మహరాణి కథా ప్రవచనం, భక్తులందరికీ జగన్నాథ అన్నప్రసాద విందు ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.